క్లుప్తంగా

అక్రమ కేసులకు భయపడేది లేదు



ఉయ్యూరు రూరల్: అక్రమ కేసులకు భయపడేది లేదని కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి భరోసా ఇచ్చారు. ఉయ్యూరు మండలం చినఓగిరాల ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, పార్టీ నాయకురాలు పాలడుగు శివ జ్యోతిపై తప్పుడు కేసు బనాయించిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం రూరల్ స్టేషన్‌కు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికార దాహంతో కొందరు నాయకులు తప్పుడు కేసులు బనాయించి పార్టీ నాయకులను, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. అనంతరం కేసుకు సంబంధించిన బెయిల్ పత్రాలను ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్ బాబుకు అందజేశారు.

జిల్లా అధికారులతో కృష్ణా కలెక్టర్ సమీక్ష

పెనమలూరు: పోరంకిలోని తాడిగడప మున్సిపల్ కార్యాలయంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన పోరంకిలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇంటికి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడి వివాహం అయిన సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించటానికి సీఎం రానున్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ గంగాధరరావు, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అదే రోజు వీఆర్ సిద్ధార్థ కాలేజీ గ్రౌండ్స్‌లో వివాహ విందు భోజనాల ఏర్పాట్లను పురస్కరించుకుని కళాశాల మైదానంలో ఎస్పీ గంగాధరరావు పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.

భూముల రీసర్వే ప్రక్రియ పరిశీలన

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో భూముల రీసర్వే పనులను సోమవారం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ఎం.జోషిలా పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన భూముల రీసర్వే వివరాలను మండల సర్వే అధికారులను అడిగి ఆమె వివరాలు తెలుసుకున్నారు. భూముల రీసర్వేలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తిచేయాలని ఆమె సూచించారు. ఐఓఎస్ లీలాప్రసాద్, డీఐఓఎస్ ఎస్వీ. నరసింహారావు, మండల సర్వేయర్ ఎన్. మాధవరావు, వీఆర్వో డి. శ్రీనివాసరావు, విలేజ్ సర్వేయర్ ఆర్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు

కంకిపాడు: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే ఉన్నత శిఖరాలు చేరుకోవటం సాధ్యమని డాక్టర్ వెంగళ శివశంకర్‌రావు అన్నారు. ఉప్పలూరు ఆర్‌సీఎం పాఠశాల్లో వెంగళ సీతారామయ్య, రాఘవమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంగళ శివశంకర్‌రావు, సత్యనారాయణమ్మ దంపతులు 100 మంది విద్యార్థులకు సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. డాక్టర్ శివశంకర్‌రావు మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదల, కృషి ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో ఉప్పలూరు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పడవల మధుసూదన్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పడవల వెంకటరమణమ్మ, ఉప సర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం ప్రసన్న పాల్గొన్నారు.

భారీ వాహనాలు రాకుండా గడ్డర్ల ఏర్పాటు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు రైవస్ కాలువ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా పంచాయతీ ఆధ్వర్యంలో గడ్డర్లు ఏర్పాటు చేశారు. వంతెన భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సిమెంట్ పిల్లర్లు నిర్మించి ఇనుప పైప్‌లు ఏర్పాటు చేశారు. ఈ పైప్‌లకు గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బయట ప్రాంతాల నుంచి భారీ లోడు లారీలు, వాహనాలు ఈ వంతెన ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. గతంలో పలుమార్లు హెచ్చరించినా రాత్రిళ్లు గుట్టుగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ చర్యలను నివారించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భారీ వాహనాలు రాకుండా వంతెన ప్రారంభంలో గడ్డర్లు ఏర్పాటు చేశామన్నారు. కట్టలపై చెత్త డంప్ చేస్తే కఠిన చర్యలతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

కంకిపాడు: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ఈడుపుగల్లులో ఒకటి, పునాదిపాడులో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 2,179 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 2,171 మంది హాజరయ్యారు.

రియల్టర్ల బరితెగింపు



తాడిగడప చానెల్ కాలువ ఆక్రమించి పిల్లర్లు నిర్మిస్తున్న వైనం



ఆర్‌అండ్‌బీ రహదారి స్థలంలో పాతిన హద్దు రేకులు

- కాలువను ఆక్రమించి పిల్లర్లు
- పంచాయతీకి అప్పగించని కామన్ స్థలం
- ఆర్‌అండ్‌బీ రహదారిపైకి వచ్చిన హద్దులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు–పోరంకి రోడ్డులో ఓ ప్రైవేట్ వెంచర్ యజమానులు టీడీపీ నాయకుల అండదండలతో నిబంధనలను అతిక్రమించి బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నారు. పోరంకి వెళ్లె రోడ్డులో సుమారు ఆరు ఎకరాల స్థలంలో విల్లాలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ స్థలానికి ఆనుకుని ఉన్న తాడిగడప చానెల్ కాలువను ఆక్రమించడం, ఆర్‌అండ్‌బీ రహదారికు చెందిన స్థలంలో రేకులు పాతడంతో వివాదం నెలకొంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కాలువగట్టును కొంత మేర ఆక్రమించి, కాలువలో పిల్లర్లు నిర్మించి ప్రహరీగోడ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో ఆగకుండా ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి చెందిన 10 అడుగుల స్థలం ఆక్రమించి రేకులు పాతారు. ఆర్‌అండ్‌బీ రహదారి, కాలువ ఆక్రమణలపై ఉన్నతాధికారులకు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు.

కామన్ స్థలాన్నీ వదల్లేదు

నిబంధనల ప్రకారం వెంచర్ వేసేవారు 10 శాతం చొప్పున కామన్ స్థలం వదిలి పంచాయతీకి అప్పగించాలి. వెంచర్‌లో వేసే రహదారులను పంచాయతీకి రాసి ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సుమారు ఆరు ఎకరాల్లో వెంచర్ నిర్మాణమవుతోంది. అంటే దాదాపు 60 సెంట్లు కామన్ స్థలం వదిలి పంచాయతీకు అప్పగించాలి. ఇప్పటి వరకూ పంచాయతీ కామన్ స్థలం ఎక్కడో కూడా చూపించలేదు. పైగా రహదారులను కూడా రాసివ్వకుండా యథేచ్ఛగా తమ పనులు సాగిస్తున్నారు.

రైతుల ఆందోళన

తాడిగడ చానెల్ కాలువ గట్టు ఆక్రమణకు గురికావడంతో సాగునీరుపై ఆధారపడ్డ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువగట్టు లేకుండా పిల్లర్లు నిర్మించడంతో తమ పొలాలకు సాగునీరు ఎలా పారుదల అవుతుందని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో కాలువ పొంగి తమ పొలాలు ముంపునకు గురి అవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణ గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హద్దు వరకే ప్రహరీ నిర్మించుకోవాలి

రైతులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోరంకి రోడ్డులో వెంచర్‌ను పరిశీలించాం. ఆర్‌అండ్‌బీ రహదారిపై 10 అడుగల మేర ముందుకొచ్చినట్లు గుర్తించాం. రేకులు తొలగించి వారి హద్దు వరకు మాత్రమే ప్రహరీ నిర్మించుకోవాలని ఆదేశించాం. తాడిగడప చానెల్ కాలువ ఆక్రమణ అంశంపై ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి గుర్తించాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఈ వెంచర్ వారు కామన్ స్థలం, రహదారులు పంచాయతీకు అప్పగించలేదు.

– ఎస్. నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి



త్రీడీ ప్రింటర్ నమూనాను పరిశీలిస్తున్న విద్యార్థులు

గన్నవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు తెలిపారు. స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. తొలుత వైజ్ఞానిక ప్రదర్శనను రెడ్‌క్రాస్ గన్నవరం శాఖ చైర్‌పర్సన్ చిన్ని మాధవీ, జిల్లా సైన్స్ ప్రాజెక్ట్ కార్యదర్శి కొంగర మాణిక్యాలరావుతో కలిసి వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల సైన్స్ నమూనాలను పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సందర్శించారు. ముఖ్యంగా విద్యార్థులు తయారుచేసిన త్రీడీ ప్రింటర్, బ్లైండ్ స్టిక్, వాటర్ డిస్పెన్సర్, గ్యాస్ లీకేజీ అలారం, ఆటోమెటిక్ విధానంలో స్ట్రీట్ లైట్ నిర్వహణ, ట్రాఫిక్ సిగ్నల్స్, రైన్ డిటెక్టివ్ అలారం, స్మార్ట్ డస్ట్‌బిన్, రివర్ ఫ్లడింగ్ అలారం, ఆటోమెటిక్ వాటర్ ప్లాంటేషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా ఫైర్ ఫైటింగ్ రోబోట్, వృక్షశాస్త్రంలోని పలు నమూనాలు, మానవ శరీరంలోని అవయవాల పనితీరుకు సంబంధించిన నమూనా విద్యార్థులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎన్. చిన వెంకట్రాయుడు, ప్రిన్సిపాల్ డి.మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

29వ రోజుకు చేరుకున్న వెటర్నరీ విద్యార్థుల దీక్షలు



గన్నవరం: ఉపకార వేతనాలు పెంచాలని స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 29వ రోజుకు చేరుకున్నాయి. కళాశాల ఆవరణలో ''ఉయ్ వాంట్ జస్టిస్'' అనే ఆకారంలో విద్యార్థులు కూర్చొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నేతలు మాట్లాడుతూ మెడికల్, డెంటల్, ఆయుష్ విద్యార్థులకు రూ. 23 వేలు నుంచి రూ. 26 వేలు వరకు స్టైఫండ్ ఇస్తున్న ప్రభుత్వం వెటర్నరీ విద్యార్థులకు మాత్రం కేవలం రూ. 7వేలు ఇవ్వడం దారుణమన్నారు. 13 ఏళ్లగా స్టైఫండ్ పెంచకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. మూగజీవాలకు వైద్య సేవలందించేందుకు సిద్ధమవుతున్న వెటర్నరీ విద్యార్థులు పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు.

ఇప్పటికైనా పాలకులు స్పందించి వెటర్నరీ విద్యార్థులకు కనీసం రూ.15 వేలకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వచ్చే వరకు తమ నిరసనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



ఎలుకపాడులో పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ మల్లిబాబు



గొల్లనపల్లిలో గేదెకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ రెడ్డెమ్మ

ఉంగుటూరు: గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయాలని డాక్టర్ మల్లిబాబు అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పలు గ్రామాల్లో ఆవులు, గేదెలకు సోమవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధికి నివారణ లేదని టీకా ఒక్కటే మార్గమని చెప్పారు. 4–8 నెలలు వయసు కలిగిన పెయ్యి దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు. ఎలుకపాడు, గారపాడు సుమారు 100 గేదెలకు బ్రూసెల్లోసెస్ టీకాలు వేశారని డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

300 పశువులకు వ్యాక్సిన్

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి, చిక్కవరం గ్రామాల్లో సోమవారం గొల్లనపల్లి పశువైద్య చికిత్స కేంద్రం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో 300 గేదెలు, ఆవులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం లక్ష్యాలను పశుపోషకులకు వివరించారు.

పశువుల్లో జ్వరం, నీరసం, నోటి నుంచి చొంగ, నోరు, కాలు గిట్టల మధ్య పుండ్లు, రొప్పటం, చూడి పశువులు ఈసుకుపోవటం లక్షణాలని చెప్పారు. వ్యాధి వలన పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే పశువులు చనిపోతాయని హెచ్చరించారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలని ఆమె సూచించారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



రామవరప్పాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



నున్నలో కొవ్వొత్తుల ర్యాలీ

రామవరప్పాడు: బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలు రాబోవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రామవరప్పాడు జెడ్పీ పాఠశాల్లో 'బేటీ బజావో– బేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే ఆహర పదార్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం బాల్య వివాహాలు నిరోధించాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తాయారు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలను రక్షించండి

నున్న(విజయవాడరూరల్): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ విజయవాడరూరల్ ఆధ్వర్యంలో సోమవారం నున్న జెడ్పీ హైస్కూల్లో మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బాలికలను రక్షించండి, బాలికలను చదివించండి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఎక్స్‌టెన్షన్ అధికారి జె.కవిత మాట్లాడుతూ బాల్య వివాహాలను జరగకుండా ఉండేందుకు తల్లిదండ్రులు బాలికలను విద్యావంతులను చేయాలన్నారు. యుక్త వయస్సులో ఏ విధంగా ఉండాలనే అంశాల పై ఆమె వివరించారు.

ఈ సందర్భంగా బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థినులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఎన్జీఓస్ మాజీ కార్యదర్శి రాబర్ట్ క్లైవ్ కన్నుమూత



గన్నవరం: ఏపీఎన్జీఓస్ అసోసియేషన్ గన్నవరం తాలూకా యూనిట్ మాజీ కార్యదర్శి, విశ్రాంత తహసీల్దారు పెసరమిల్లి రాబర్ట్ క్లైవ్ (76) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యతో పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు ఆదివారం రాత్రి 9.30 గంటలకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం ఆర్ఐ, డీటీ, తహసీల్దారుగా ఆయన సేవలందించారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్‌లో 1990 నుంచి 2002 వరకు గన్నవరం తాలూకా యూనిట్ కార్యదర్శిగా వరుసగా నాలుగు సార్లు రాబర్ క్లైవ్ ఎన్నికయ్యారు. రాబర్ట్ క్లైవ్ మృతిపై ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, మాజీ ఎన్జీవోస్ అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, ప్రస్తుత ఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, వంశీమోహన్, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మోహన్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక రైస్‌మిల్లు రోడ్డులోని స్వగృహంలో ఆయన భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు.

దాతల సాయంతో విద్యార్థులకు అల్పాహారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం సాయంత్రం నిర్వహిస్తున్న అదనపు తరగతుల్లో దాతల సాయంతో అల్పాహారం అందిస్తున్నట్లు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. నెల రోజుల పాటు అల్పాహారం అందించేందుకు కావాల్సిన సరుకులను సరిపల్లి సింధుజ్యోతి, కట్టా నరేంద్ర, చింతల కోటేశ్వరరావు అందించినట్లు ఆయన తెలిపారు. దాతల సాయంతో సిద్ధం చేసిన అల్పాహారాన్ని సోమవారం అదనపు తరగతుల్లో టెన్త్ విద్యార్థులకు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్ చేతుల మీదగా పంపిణీ ప్రారంభించారు.

ఒకవైపు పరీక్షలు.. మరోవైపు తరగతులు



ఉయ్యూరు చైతన్య జూనియర్ కళాశాల్లో క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యూరు రూరల్: విద్యాశాఖ నిబంధనలకు చైతన్య విద్యాసంస్థలు తూట్లు పొడుస్తున్నాయి. ఒకవైపు ఇంటర్ విద్యార్థులకు రోజూ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు వేర్వేరుగా పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు పరీక్షలు నిర్వహిస్తున్న కళాశాల్లో ఎలాంటి తరగతి గదులు నిర్వహించరాదని నిబంధన విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఉయ్యూరు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం ఒక అడుగు ముందుకేసి ఇంటర్ రెండో సంవత్సరం పరీక్ష అదే కేంద్రంలో నిర్వహిస్తుండగా మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు నిర్వహించారు.

అధికారులకు సమాచారం

తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మీడియాకు, అధికారులకు సమాచారం అందించడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఉన్నతాధికారుల రాకతో కళాశాల యాజమాన్యం విద్యార్థులను బయటకు పంపి చేతులు దులుపుకుంది. ఈ క్రమంలో కళాశాల నుంచి చైతన్య పాఠశాలకు పంపి గుట్టుచప్పుడు కాకుండా క్లాసులు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పూర్తిస్థాయిలో బయటకు పంపారు. ఇంత జరుగుతున్నా ఉన్నత విద్యాశాఖ అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహించిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

బరంతులు వదిలేశారు

- మార్జిన్ దిగాలంటే ఎలా?
- ప్రమాదకరంగా రోడ్ల నిర్మాణం

కంకిపాడు: రహదారులు నిర్మాణంలో శాఖాపరమైన పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్ల మార్జిన్‌లకు బరంతు లేకుండా వదిలేయటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేలా అధికారుల చర్యలు ఉన్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

పల్లె పండుగలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో 48 పనులు మంజూరయ్యాయి. వీటికి రూ.9.54 కోట్లు కేటాయించారు. వీటిలో 33 సిమెంటు రోడ్లను రూ.6.35 కోట్లతో, 9 తారు రోడ్లకు గానూ రూ.2.64 కోట్లు, మూడు ప్రహరీగోడలకు రూ.29.85 లక్షలు, మూడు క్రిమేషన్ షెడ్స్‌కి రూ.25.95 లక్షలు మంజూరయ్యాయి. చాలా వరకూ రహదారుల నిర్మాణ పనులు పూర్తి కాగా, మరికొన్ని రహదారుల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి.

సమస్య సిమెంటు రోడ్లతోనే..

సిమెంటు రోడ్లను నిర్మించారే కానీ రోడ్డు మార్జిన్‌లో బరంతులు మాత్రం నింపలేదు. దీని కారణంగా రోడ్డు మార్జిన్ దిగాలన్నా, ఎక్కాలన్నా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా భారీ వాహనాలు వస్తే రోడ్డు మార్జిన్ దిగే అవకాశం కూడా లేకుండా పోయింది. అదుపుతప్పి కింద పడితే ప్రమాదం బారిన పడినట్టే. టీడీపీ అనుయాయులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు నిర్వహించారు. దీంతో పర్యవేక్షించాల్సిన అధికారులు అధికారపక్షానికి వత్తాసు పలుకుతున్నారు. ఫలితంగా పలువురు కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మించినా బరంతు వేయకుండా వదిలేయటంతో ప్రజలకు శాపంగా మారింది.



కంకిపాడులో బరంతు లేకుండా ఉన్న సిమెంటు రోడ్డు



గోసాలలో రోడ్డు మార్జిన్‌లో సిమెంటు స్తంభాన్ని ఉంచే రోడ్డు పూర్తి చేసిన దృశ్యం



ఈడుపుగల్లులో బరంతు లేకుండా ఉన్న సిమెంటు రోడ్డు

డెప్యూటీ సీఎం చూసిన రోడ్డు ఇదే

గోసాల పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని రూ.33 లక్షలు అంచనా వ్యయంతో సిమెంటు రోడ్డు, సీసీ డ్రెయిను నిర్మాణం జరిగింది. ఈ పనులను గతంలో డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కంకిపాడు పర్యటన సమయంలో పరిశీలించి వెళ్లారు. ఈ రోడ్డు కూడా ప్రస్తుతం బరంతు లేకుండానే ఉంది. విచిత్రం ఏమిటంటే సిమెంటు స్తంభం సిమెంటు రోడ్డుమార్జిన్‌లో ఉంచేసి రోడ్డు పనులు పూర్తి చేశారు. సిమెంటు రోడ్డుకు సుమారు అడుగు మేరకు పల్లంగా సిమెంటు డ్రెయిను నిర్మించారు. ఆదమరిచి వాహనదారులు రోడ్డు మార్జిన్‌కు వస్తే ప్రమాదం బారిన పడినట్టే. వాహనదారులు, పాదచారుల భద్రత విస్మరించి రోడ్డు నిర్మాణాలు సాగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా సాగాలి

ఉయ్యూరు రూరల్: లింగ వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు ముందుకు సాగాలని ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు కోరారు. మండలంలోని కాటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈనెల 8న మహిళా దినోత్సవం జరగనున్న నేపథ్యంలో ముందస్తుగా మహిళా సాధికారత అంశంతో పాటు లింగ సమానతను ప్రోత్సహించడం, పితృస్వామిక నిబంధనలను సవాలు చేయడంలో పురుషుల పాల్గొనాల్సిన అవసరంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.